ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY

# ఎంసెట్ ఫలితాలు మే 3న

- ఈ నెల 25న కీ విడుదల
- అభ్యంతరాలను 27లోగా వెబ్‌సైట్‌కు పంపాలి
- మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడి

**కాకినాడ, న్యూస్‌టుడే:** ఏపీ ఎంసెట్‌కు సంబంధించిన ప్రాథమిక 'కీ' ని ఈ నెల 25న విడుదల చేస్తామని మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ఆదివారమిక్కడ తెలిపారు. కీలో అభ్యంతరాలుంటే ఈ నెల 27లోగా వాటిని వెబ్‌సైట్‌కు పంపాలని, విద్యార్థులు రాసిన జవాబు పత్రాన్ని కీతో సరిపోల్చుకునేందుకు వీలుగా వారి ఈ మెయిల్‌కు జవాబు పత్రాన్ని పంపించడం సహా వెబ్‌సైట్‌లోనూ పొందుపరుస్తామన్నారు. మే 3న ఎంసెట్ ఫలితాలను విడుదల చేస్తామని చెప్పారు. తొలుత (మిగతా 2లో)

## ఎంసెట్ ఫలితాలు మే 3న

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం కాకినాడలోని జవహర్‌లాల్‌నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయంలో ఏపీ ఎంసెట్ సెట్‌కోడ్‌ను మంత్రి విడుదల చేశారు. అనంతరం గంటా విలేకరులతో మాట్లాడుతూ...ప్రతిరోజు జరిగే ఎంసెట్‌కు సంబంధించి ప్రత్యేక కోడ్‌ను ఆవిష్కరిస్తామన్నారు. 2015, 2016లలో ఎంసెట్‌ను ఆఫ్‌లైన్‌లో నిర్వహించగా 2017లో దేశంలోనే తొలిసారిగా ఆన్‌లైన్‌లో విజయవంతంగా నిర్వహించినట్లు గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో జేఎన్టీయూకేకు తిరిగి నాల్గవసారి నిర్వహణ బాధ్యతలను అప్పగించామన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు తరలిపోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఎంసెట్ పరీక్షను ప్రణాళికబద్ధంగా నిర్వహిస్తోందన్నారు. దీనిలోభాగంగా అన్ని సెట్‌ల కంటే ముందుగానే ఏపీ ఎంసెట్‌ను నిర్వహించి విద్యార్థులకు భరోసా కల్పిస్తున్నామని ఆయన చెప్పారు. గతంలో ఎంసెట్ నిర్వహిస్తే ఎప్పుడు ఫలితాలు వస్తాయో, తరగతులు ఎప్పుడు నిర్వహిస్తారో తెలియని పరిస్థితి ఉండేదని, ఏపీలో తెదేపా అధికారంలోకి వచ్చాక జూన్ నెలాఖరులోగా తరగతులు ప్రారంభమయ్యేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి గంటా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంసెట్ ఛైర్మన్, జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్.రామకృష్ణారావు, వర్సిటీ రిజిస్ట్రార్ వీవీ సుబ్బారావు, ఎంపీ పండుల రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.




తొలిరోజు ఎంసెట్ కోడ్ విడుదల చేస్తున్న మంత్రి గంటా శ్రీనివాసరావు

### *తొలిరోజు 95 శాతం హాజరు*

ఆదివారం ఎంసెట్ ప్రశాంతంగా జరిగింది. ఏపీలో 131 పరీక్షా కేంద్రాలు, హైదరాబాద్‌లోని 6 కేంద్రాల్లో కలిపి 137 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. తొలిరోజు ఉదయం 32,772 మంది హాజరుకావాల్సి ఉండగా 31,157మంది పరీక్ష రాశారని ఎంసెట్ కన్వీనర్ సీహెచ్.సాయిబాబు తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 32,762 మంది హాజరవ్వాల్సిఉండగా 31,117 మంది వచ్చారు. మొత్తంగా తొలిరోజు 95 శాతం హాజరు నమోదైంది.